క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎంపీ అభ్యర్థి తనూజరాణి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రను కలిసిన ఎంపీ అభ్యర్థి తనూజరాణి, చెట్టి వినయ్ దంపతులు

అనంతగిరి: అరకు నియోజకవర్గ పరిశీలకురాలుగా నియమితులైన ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను, అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజరాణి, చెట్టి వినయ్ దంపతులు విశాఖపట్నంలోని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. సీఎం జగనన్న వైఎస్సార్‌సీపీలోని మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, జెడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చెప్పారు. అనంతరం పార్టీ బలోపేతానికి చేపట్టాల్సి కార్యక్రమాలపై చర్చించారు.

తహసీల్దార్‌గా శేఖర్ బాధ్యతల స్వీకరణ



ఎటపాక: మండల తహసీల్దార్‌గా డి.శేఖర్ నియమితులయ్యారు. ఈయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విశాఖలోని జీసీసీలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ టి.పృథ్వీని చింతూరు ఐటీడీఏ ఏవోగా బదిలీ చేశారు.

రేపు గ్రామాల్లో విశ్వేశ్వరరాజు పర్యటన

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ పాడేరు అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు మండలంలోని పాత పాడి, కొత్తపాడి, గుజ్జుమానుపాకలు, కొండగోకిరిలో శనివారం పర్యటిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు గురువారం తెలిపారు. కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పోరేషన్ల డైరెక్టర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

సీలేరు: పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ గ్రామాల్లో గూడెం కొత్తవీధి సీఐ అప్పలనాయుడు గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో బుధవారం మైదాన ప్రాంతాలకు చెందిన యువకులు చేసిన హల్‌చల్ గొడవలపై గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గ్రామాల్లో దొంగలు సంచరిస్తున్నట్టు, చిన్నారులను ఎత్తుకుపోతున్నట్టు సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలు, వదంతులను గ్రామస్తులు నమ్మవద్దన్నారు. గ్రామాల్లో అనుమానస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ రామకృష్ణ ఉన్నారు.

శరవేగంగా చెరువు పనులు



అంబేడ్కర్ పార్కు వద్ద చెరువు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో అంబేడ్కర్ పార్కు సమీపంలో ఉన్న చెరువు పనులు గత కొన్ని రోజులుగా శరవేగంగా జరుగుతున్నాయి. గత 20 ఏళ్లుకు పైగా చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి, అధ్వానంగా తయారైంది. దీంతో చెరువు అభివృద్ధి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు జెడ్పీ నిధులు సుమారు రూ.30లక్షలు కేటాయించారు. మొదటిగా రూ.10లక్షలు విడుదల చేయడం జరిగింది. గత నెలలో చెరువు పనులను జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర పనులు ప్రారంభించారు. ప్రసుత్తం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. చెరువు చుట్టు ప్రహరీ, రాతి కట్టు, వాకింగ్ ట్రాక్, డ్రైనేజీ, విద్యుత్ లైట్లు ఏర్పాటు, కుర్చీలు, గార్డెన్ వంటి పనులు చేయనున్నారు. చెరువుతో పాటు అంబేడ్కర్ పార్కును సైతం సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎన్నడూ లేని విధంగా చెరువు ఆధునీకరణ పనులు జరుగుతుండడంపై మండల కేంద్ర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య భాగ్యం



సీతపల్లిలో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం



ఏరియా ఆస్పత్రిలో నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం

- గిరిజనుల చెంతకే వైద్యం
- రూ. 21.09 కోట్లతో కొత్త పీహెచ్‌సీల భవనాల నిర్మాణం

రంపచోడవరం: నేడు మన్యంలో గిరిజనులకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా కార్పొరేట్ వైద్యం అందుతోంది. ప్రతి పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంచి సేవలందిస్తున్నారు. సమాచారం అందుకోగానే రోగి వద్దకు వెళ్లి అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించే వ్యవస్థ వచ్చింది. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా ఉండేది.. ఏ రొగమొచ్చినా డోలీమోతలతో సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కానరాని వైద్యులు.. అందని సేవలతో సతమతమయ్యేవారు. గిరిజనులు వైద్యం కోసం ఆపసోపాలు పడినా..అవస్థలు పడుతున్నా అప్పటి టీడీపీ యంత్రాంగం..పాలకులు కనీసం పట్టించుకోలేదు.. దీంతో సకాలంలో వైద్యం అందక అమాయక గిరిజనులు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి.. అదంతా గతం ... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక గిరిజనులకు పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. శ్రీకారం చుట్టారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు జీవం పోశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు, అధునాతన వైద్య పరికరాలు సమకూర్చారు. ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని భర్తీ చేశారు. 24 గంటలు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఇంటింటికీ వైద్యం అందేలా ఫ్యామిలీ డాక్టర్ సేవలు... జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అన్ని వేళల్లో వైద్య సేవలు

ఏజెన్సీ ప్రధాన కేంద్రం రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. రంపచోడవరంలో ఏరియా ఆస్పత్రిలో ఏళ్ల తరబడి ఖాళీగాఉన్న ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టులు భర్తీ చేశారు. ప్రతీ రోజు 400 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. 150 మంది వరకు ఇన్‌పేషెంట్‌లుగా వైద్యం అందిస్తున్నారు.ఆస్పత్రిలో 16 మంది వైద్యులు ఉండగా ఆరుగురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. వైద్య సేవలు బలోపేతం చేసేందుకు రూ. 21.09కోట్ల వ్యయంతో 13 కొత్త పీహెచ్‌సీ భవనాలు నిర్మించారు.నాడు-నేడులో భాగంగా రూ. 516లక్షల వ్యయంతో పీహెచ్‌సీ భవనాలకు మరమ్మతులు చేయించారు.రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నెలకు 500 మంది వరకు కిడ్నీ రోగులకు డయాలిసిస్ చేసే సదుపాయం కల్పించారు.

గ్రామాల్లో పీహెచ్‌సీలకు మహర్దశ

ఏజెన్సీలో 13 కొత్త పీహెచ్‌సీ భవనాలు నిర్మించారు. వాటిలో రోగులు ఉండేందుకు వార్డులు ఏర్పాటు చేశారు. అడ్డతీగల మండలం దుప్పిపాలెంలో రూ. 1.52కోట్ల వ్యయంతో కొత్త పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. గంగవరంలో పాత పీహెచ్‌సీ భవనం స్థానంలో రూ. 1.52కోట్లతో వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించారు. మంగంపాడులో రూ. 1.66 కోట్ల వ్యయంతో నిర్మాణం **చేపట్టిన భవనం పనులు** పూర్తయ్యే దశలో **ఉన్నాయి. పోలవరం ముంపులో** ఉన్న దేవీపట్నం **పీహెచ్‌సీని పెదభీంపల్లిలో** రూ. 1.51కోట్ల **వ్యయంతో నిర్మించారు.అలాగే** రంపచోడవరం**కు పది కిలోమీటర్ల దూరంలోని** సీతపల్లిలో కొత్త **పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు.** ఇందుకోసం రూ. **1.52 కోట్ల వ్యయం ఖర్చు** చేశారు. దేవీపట్నం **మండలం వెలగపల్లిలో కొండ**మొదలులో ముం**పునకు గురైన పీహెచ్‌సీని ఇక్క**డ నిర్మిస్తున్నారు. **నెల్లిపాక, గౌరిదేవీపేట, కుటూ**రు, రేఖపల్లి,లక్ష్మి**పురం, తులసిపాక, కూనవరం**లో కొత్త పీహెచ్‌సీ **భవనాలు నిర్మిస్తున్నారు.** రంపచోడవరం **ఏరియా ఆస్పత్రిలో వంద** పడకల వసతితో **పాటు రూ. 12.60కోట్ల వ్య**యంతో మాతాశిశు సంరక్షణ భవనం నిర్మించారు. రంపచోడవరంలో రూ. 49.26 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వైద్య సేవలు బాగున్నాయి



ఏజెన్సీలో వైద్య సేవలు బాగా అందుతున్నాయి. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో కూడా అన్ని రకాల జబ్బులకు వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో చిన్న వైద్యానికి కూడా రాజమహేంద్రవరం పంపించే వారు. ప్రస్తుతం ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు.

–బాలురెడ్డి, ముసురుమిల్లి

పేదలకు కార్పొరేట్ వైద్యం



ఒకప్పుడు రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రోగులు కనీస వసతులు కూడా ఉండేవి కావు. ఈ ఐదేళ్ల కాలంలో ఆస్పత్రిలో ఎన్నో వసతులు కల్పించారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుంది. రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతుంది. ఏజెన్సీ వాసులుకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతాయి.

– పూజ, రంపచోడవరం

భాగ్యలక్ష్మికి అభినందనల వెల్లువ



జిల్లా పార్టీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మికి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలుపుతున్న నేతలు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. చింతపల్లి, జి.కే.వీధి మండలాల ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు గురువారం పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ ముత్యాలమ్మ, ఎంపీటీసీ రాములమ్మ

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న పార్వతీ పరమేశ్వర ఉత్సవాల సందర్భంగా గురువారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ముత్యాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాములమ్మ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన యువతలో ప్రతిభకు లోటులేదని దానిని సాన పెడితే ఉన్నత ఫలితాలు వస్తాయన్నారు. ప్రతిభను మండల స్థాయి నుంచి జిల్లా,రాష్ట్ర స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. ఏఎస్‌ఐ లక్ష్మణరావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: స్థానిక సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్‌లో గురువారం జరిగిన కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరానికి వచ్చిన 100 మంది రోగులను గౌతమి నేత్రాలయం (రాజమహేంద్రవరం) వైద్య నిపుణులు డాక్టర్ సత్య పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్రచికిత్స అవసరమున్నట్టు పది మందిని గుర్తించామని, వారికి ఉచిత సేవలు అందజేస్తామన్నారు. రోగులను రాజమహేంద్రవరంలోని ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్స అనంతరం క్షేమంగా వారిని తమ తమ ఇంటికి పంపిస్తామన్నారు. పాస్టర్ వినయ్ వర్మ, సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ కమలేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ విత్‌డ్రాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

వీఆర్ పురం: మినీ ఏటీఎం సెంటర్లలో ఖాతాదారులు తెలియజేసిన నగదుకు మించి విత్‌డ్రా చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం మండలంలోని మినీ ఏటీఎం సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమాయక ఆదివాసీ గిరిజనులు, రైతులు నగదు అవసరాలకు స్థానికంగా ఉన్న మినీ ఏటీఎం సెంటర్లపై ఆధారపడతురన్నారు. అలాంటి పరిస్థితుల్లో వారి ఖాతాల నుంచి గతంలో నగదును తస్కరించినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఖాతాదారులకు మోసగించడం తగదన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మడకం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



ముంచంగిపుట్టు మెయిన్‌రోడ్డులో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.గత కొన్ని రోజులు దొంగతనాలు జరగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్ కూడలి సమీపంలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు, పెదబయలు మార్గాల వైపు ప్రయాణించే వాహనాలు, వ్యక్తులు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం తెలుసుకోవచ్చు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా మండల కేంద్రంలో జరుగుతున్న వ్యవహారాలపై నిఘా ఉంచవచ్చన్నారు. త్వరలో మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి, జెడ్పీ గెస్ట్ హౌస్ కూడలి, సాయిబాబా ఆలయం కూడలి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుపై మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగార్రాజు మృతికి సంతాపం



బంగార్రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, జి.మాడుగుల ఎంపీటీసీ విజయకుమారి మామయ్య మత్స్యరాస పెదబంగార్రాజు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హుటాహుటిన జి.మాడుగులలో బంగార్రాజు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతిని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు తదితరులున్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెదబయలు: జిల్లాలో సికెల్‌సెల్ ఎనీమియాను తరిమికొట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పెదబయలు, ముంచంగిపుట్టు పీహెచ్‌సీల వైద్య సిబ్బంది చెప్పారు. మండలంలోని సీకరి, బంగారుమెట్ట, అడుగులపుట్టు పంచాయతీ తమరడ ,తొరంగుల, పర్రెడ, పెద్దాపుట్టు, ముంచంగిపుట్టు మండలం మద్దులబంద, చీపురుగొంది, కెందుగుడ, మూలపుట్టులో పాఠశాలల విద్యార్థులకు గురువారం సికెల్‌సెల్ వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పాఠశాలల్లో అందిస్తున్న పోషకాహారం తీసుకోవాలని సికిల్‌సెల్ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేసుకుని చికిత్స తీసుకోవాలన్నారు. శరీరంలో రక్తం తక్కువగా ఉండి శరీరం కాళ్లు, చేతులు వాపు వస్తోందన్నారు. వైద్య సిబ్బంది. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం



పద్మాపురం పంచాయతీలోని గ్రామస్తులతో వైఎస్సార్‌సీపీ నాయకులు



దోమలగొందిలో గ్రామస్తులతో వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు

అరకులోయరూరల్: మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలో పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధిలో బొండంగుడ, పింపోలుగుడ, దుమగుడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణకుమార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు అందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. టీడీపీ మోసపూరిత హామీలనుప్రజలు నమ్మవద్దన్నారు.

ఎంపీటీసీ సభ్యులు శత్రుగున్, రాంచందర్, సర్పంచ్ సుస్మిత, నాయకులు పరుశురాం, రాంబాబు, మోహన్, నర్సింగ్, రఘు, సుంక్ర, రామ్మూర్తి, అర్జున్, హరి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: రానున్న సార్వత్రిక ఎన్నికలల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ పని చేద్దాం అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు అన్నారు.మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు, కార్యకర్తలతో సమవేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగంల గెలుపు కోసం గ్రామ స్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా జగబంధు మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి జగనన్న పాలనలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేయాలన్నారు. శివారు గ్రామాలకు రోడ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, గడపవద్దకే పింఛన్ ఇలాంటి కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ పాలనలోనే జరిగాయని, వీటిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. అరకు నియోజకవర్గ పరిశీలకురాలిగా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రను పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడం పట్ల స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు.వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు నీలకంఠం, భాగ్యవతి, రమేష్, ఎంపీటీసీ కమల, నేతలు గాసిరావు, సోలెమాన్, సన్యాసిరావు, అప్పారావు, సురేష్, పద్మరావు, నానిబాబు, రాంప్రసాద్, మణి, రాజారావు, తిరుపతి, జగన్నాథం, దాసు, పులిరాజు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో జగనన్నను మన ముఖ్యమంత్రిగా గెలుపించుకొవడానికి మేము అంతా సిద్ధం అని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలో లోతుగెడ్డ పంచాయితీ దోమలగోంది గ్రామంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం అనే కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందాలంటే జగనన్నను మళ్లీ మన ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్లు తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు ఓటు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిపించి, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్, వార్డు సభ్యులు ధర్మయ్య, నాయకులు కృష్ణారావు, గంగన్నపడాల్, రామారావు, రామారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



యువతకు క్రీడా సామగ్రి అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమాండెంట్ సురేష్




విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

చింతూరు: సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సీఆర్పీఎఫ్ ఈ-42 బెటాలియన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండలంలోని చట్టి, బుర్కనకోట, పాలగూడెం, సుద్దగూడెం, జువ్విగూడెం గ్రామాలకు చెందిన యువత ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ధర్మప్రకాష్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు చెందిన యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటు క్రీడా సామగ్రిని అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్, హెచ్ఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

సీలేరు: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో సీఆర్‌పీఎఫ్ జి-42 బెటాలియన్ ఆధ్వర్యంలో షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలను గురువారం నిర్వహించారు. విజేతలకు షీల్డ్‌లు అందజేశారు. కమాండెంట్ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. వైద్యాధికారి సౌమ్య, ఇన్‌స్పెక్టర్ సుభాష్, పాండే పాల్గొన్నారు.

మోతుగూడెం: వైరామవరం మండలం బొడ్డగండి పంచాయితీ డొంకరాయి గ్రామంలో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో డొంకరాయి టీం ప్రథమ స్థానం సాధించగా, బచ్చులూరు జట్టు రెండవ స్థానం సాధించింది. డొంకరాయి ఎఫ్ 42 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండర్ సురేష్ బాబు క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లు అందజేశారు. విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామ యువతకు సీఆర్‌పీఎఫ్ ద్వారా ఏ సహాయం కావాలన్నా అందిస్తామన్నారు. సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ పాల్గొన్నారు.

పిప్పళ్లకు గిరాకీ



వారపు సంతలో పిప్పళ్ల విక్రయాలు

పెదబయలు: ప్రస్తుతం పిప్పళ్లకు డిమాండ్ నెలకొంది. వారపు సంతలో ఎక్కువగా అమ్మడవుతుంది. మన్యం గిరిజన రైతులు పసుపు, పిప్పళ్ల సేకరణలో నిమగ్నమయ్యారు. ఏ గ్రామంలో వెళ్లిన ఇదే పనిలో గిరిజన రైతులు ఉన్నారు.జనవరి నుంచే పసుపు, పిప్పళ్ల సేకరణ జరుగుతుంది. అయితే ఈ ఏడాది మార్కెట్ ధర బాగుండడంతో గిరిజన రైతులు ఎంతో వేగంగా సేకరించి అమ్మకాలు చేస్తున్నారు. ఈ ఏడాది పసుపునకు ఆశించిన ధర ఉండడంతో కొంత మేరకు ఆశక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది మార్కెట్ ధర ఎక్కువగా ఉండడంతో రైతులు పసుపు, పిప్పళ్ల సేకరణలో నిమగ్నమై ఉన్నారు.

యూటీఎఫ్ నేతకు నివాళి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత అప్పారి వెంకటస్వామి వర్ధంతిని జరిపారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజు, గోపి, శ్రీనివాసమూర్తి, సుబ్బారావు, ధనుపతి, గణేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com